
కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# దొరకోటు

**ఆ**దం ఇవేళ జోరుగా నడుస్తున్నాడు. వాలునీటి మీద తెప్ప కొయ్యలా వీధి కిరువైపుల కూర్చునున్న జనం చూపుల మధ్య ఒదిగొదిగి సర్రున జారిపోతున్నాడు. ఎత్తిన తెరచాపలా రొమ్ము విరుచుకుని మరీ అడుగులేస్తున్నాడు.



రెండుమూరల గుడ్డ నడుముకు చుట్టుకుని, పేదరికపు మరకలు పడ్డ చిరుగుల చొక్కాతో, పీలికలైన నల్లటికంబళి భుజానేసుకుని, ఒకచేత పెద్ద డొక్కు లాంతరు, మరోచేత పోటుకర్రతో వయోభారంతో వుసూరుమంటూ వెళ్తూ, చేవదేలని గడకర్రలా వుండే ఆదంను సాయంత్రం వేళ రోజూ చూస్తూనే వుంటారు.

అయితే ఈ రోజు మాత్రం వాడిలో ఒక ప్రత్యేకత అయస్కాంతంలా అందర్నీ ఆకర్షించింది. మూడొంతులకు పైగానే వాడిని మింగేసిన నల్లకోటు అపరిచితుడైన వ్యక్తిలా అందర్నీ అయోమయంలో పడేసింది.

దూరం నుండి చూసి తేలిగ్గా పోల్చుకోలేక పోయారుగాని అందరికీ చిరపరిచితమైన డొక్కు లాంతరు, పోటుకర్ర వాడి అస్థిత్వాన్ని వెల్లడించాయి.

"ఓరీడు ఆదంగాడు గదంట్రా! ఇవ్వాళ కొత్త అవతారం ఎత్తేడే!" అంటూ అంతా ఒకటే నవ్వటం.

ఆదంకు మాత్రం ఇవ్వాళ క్రొత్తజన్మ ఎత్తినట్లే వున్నది. అతగాడి హుషారంతటికి మూల కారణం వంటిమీదున్న ఆ కోటే!

"ఏవిట్రా ఈ వేషం!" పలకరించాడు ఒక రైతు.

"దొరకోటండీ...మిసనోల్లిచ్చారు!" అన్నాడు ముసిముసిగా నవ్వుతూ.

"దొరకోటేవిట్రా?"

"ఇది ఇదేశాల్లో దొరలేసుకునేదంటండి. మాబోటి పేదోల్ల కిమ్మని పంపినారంట".

"కొత్తదిలానే వుందే" అన్నాడింకొక ఆసామి.

"అవునయ్యా! యాడ సిన్న సిరుగన్నదిలేదు" చెప్పాడు మురిపెంగా.

"ఆc! కొత్తయ్యవడిస్తాడ్లే! దొరలు మనలాగ చిరుగులు పట్టి చీకిపోయేదాక వేసుకుంటారా! కొన్నాళ్లు తొడుక్కునే పంపి వుంటారు".

"అయితే మాత్రం బంగారంలాంటి కోటు ఇత్తానికి ఎవురికి పేనం ఒప్పుద్దండీ! దరమ ప్రభువులు దొరలు!" అన్నాడు ఆదం కృతజ్ఞతతో తలమునకలుగా.

"మొత్తానికి మతం పుచ్చుకున్న వాళ్లపని బాగానే వున్నట్లుంది. ఏదోకటి ఇస్తూనే వున్నారు".

"అంతా ఆ ప్రభువుదయ!" భక్తిగా అన్నాడు ఆదం ఆకాశం లోకి చూస్తూ.

"ఈసారిస్తే నాకూ ఒకటి తెచ్చివ్వరా ఆదం! ఉత్తినే ఇవ్వద్దులే, డబ్బులిస్తాను" అన్నాడొక రైతు.

"డబ్బుల కాశపడి ఇంత మంచి కోటు అమ్ముకునే ఎర్రినా కొడుకెవరండయ్యా!" అన్నాడు ఆదం బెట్టుగా.

"పెద్ద చెప్పొచ్చావులేరా! మిషనోల్లిచ్చిన పేంటులు, చొక్కాలు, కోటులు మీ పల్లెవాళ్లంతా వేసుకునే తిరుగుతున్నారా? పదికో,పాతిక్కో అమ్ముకోవటంలా " అన్నాడు రైతు.

ఆదం ముఖం చిన్నబుచ్చుకున్నాడు. ఆ ఆరోపణలో వున్న నిజం ఆదంకు తెలుసు. పల్లెలో బట్టలు పంచారని ఏ కాకి కబురందిస్తుందోగాని పట్నం నుండి సైకిళ్లేసుకుని మనుషులొస్తారు. గుడ్డనుబట్టి, అమ్మే వ్యక్తిని బట్టి పాతికా, యాభై చేతిలో పెట్టి సాయంత్రానికల్లా తలోమూట మోసుకెళ్తారు. ఆ బట్టల్ని పట్నంలో అధిక లాభాలకు అమ్ముకుంటారని ఆదంకు ఎవరో చెప్పారు.

మిషనరీ వాళ్లు ఇచ్చిన బట్టల్ని అమ్ముకునే వాళ్లను చెడా మడా తిట్టిపోసేవాడు.

"వంటిమీద కప్పుకోను బట్టలేదని దయతో ఇత్తే ఇదేం పనిరా, ఎర్రినాయాల్లారా! ఇలాంటి బట్ట జనమలో కొనగలమా!" అంటూ వాళ్లమీద కస్సుమనేవాడు.

"చాల్లే వూరుకో ముసలోడా! ఆల్లిచ్చారని బుసుకోటులు, పేంటీలు ఏసుకెల్తానికి మనమేవన్నా కలకటేరు గుమస్తాలవా! మట్టి పిసుక్కునే కూలెధవలం. ఈ రోజయినా దొరల పేరు సెప్పుకొని కడుపు కింత తినొచ్చు" అంటూ ఆదం మీద విరుచుకుపడేవారు.

"ఏందిరా ఆలోచన! నాల్రూపాయలెక్కువే ఇస్తాన్లే". రెట్టించాడు ఆ రైతు.

"అయ్యా! బుద్ధిమాలినోల్లు ఎవురయినా అమ్మితే ఆల్లకాడే కొనుక్కోండి. నే నమ్మను. అయినా మీ బోటివోల్లకు ఈ కరమ ఎందుకండీ. కావాలంటే పట్నం ఎల్లి చిటికలో తెచ్చుకోగల్రు".

"అఁ! ఇంత చవుకలో దొరకొద్దూ. ఏదో చలి బాగా కాసుద్దనిగాని వందలుపోసి కొనడం పరమదండగ" అన్నాడా రైతు.

"అద్సరేగానొరే! సూరయ్యగారి చేలో వరికుప్ప పగలదీశారంటగదా! నువ్వేం చేస్తున్నట్లు?" అడిగాడో రైతు.

"నేను సూడబట్టేగదండీ, గింజ రాలక ముందే తరిమికొట్టింది. మైలు దూరంలో గడ్డి పరకలు గలగలలాడినా నా చెవుల పడతదండి. కఱ్ఱ తీసుకునిలబడ్డానంటే ఆల్లో నేనో తేలిపోవాల" అన్నాడు ఆత్మ విశ్వాసంతో ఛాతీ విరిచి.

"సరె సర్లే! గాలి తిరుగుళ్లకు అలవాటుపడ్డ కుఱ్ఱ గాడిదల పన్లే ఇవి.... జాగ్రత్త." హెచ్చరించాడు ఓ కామందు.

"వత్తానయ్యా! పొద్దు వాలతా వుంది.... ఓ పొగాకు పాయ ఎట్టండిబాబు!" అంటూ దోసిలి పట్టాడు.

ఆ రైతు ఒక పొగాకు కాడ ఆదం దోసిట్లో వేశాడు. నల్లగా నిగనిగలాడుతున్న ఆ కాడ చూస్తూనే వాడి కళ్లు మిలమిల మెరిశాయి. కాడ ముక్కు దగ్గరుంచుకుని గుండెలంటేలా వాసన పీల్చి ఆ ఘాటుకు మహదానంద పడ్డాడు.

"ఎంతయినా యీరయ్యగారు దరమరాజే!" అంటూ హుషారుగా ముందుకు సాగేడు.

దారి పొడుగునా ఆదంను ఒకటే పలకరింపులూ, పరామర్శలూను...అందుకు కారణం వాడి ఒంటి మీదున్న కోటే!

ఊరు దాటి పొలాల్లో అడుగు పెట్టేసరికి మసక చీకట్లు కమ్ముకుంటున్నాయి. అగి దీపం వెలిగించి ముందుకు సాగేడు. రోజూ పొలాల్లోకి అడుగు పెట్టగానే రివ్వున వీచే చలిగాలికి వళ్లు బిగిసినట్టయి అడుగులు పడేవికావు. అలాంటిది చేల గనేల మీద చకచకా నడుస్తున్నాడు.

ఈ రోజు ఆదంను నడిపిస్తున్నది కందరాల బలం కాదు. ఈ జీవితానికి తీరదనుకున్న కోరిక తీరిన సంతోషం వాడికి నూతనోత్తేజాన్నిచ్చింది.

రాత్రిళ్లు చల్లగాలికి వాడి ముసలి శరీరం తట్టుకోలేకపోతున్నది. అవయవాలు కొంగర్లు తిరిగి బాధతో విలవిలలాడి పోతున్నాడు. ఒకో రోజయితే చలికి ప్రాణం నిలువునా పోతుందేమో అనిపించేది. చలికి కాసుకునేందుకు గట్టి దుప్పటయినా లేదు. కాళ్లావేళ్లా పడితే ఎవరో ఒక చిరుగుల కంబళి ఇచ్చారుగాని అదీ పనికిరానిదయింది.

ఊళ్లో చలి కోటు వేసుకున్న వాళ్లను చూసినప్పుడల్లా తనూ అలాంటి కోటు ఒకటి సంపాదించాలని ఆరాట పడేవాడు. కొందామంటే డబ్బులేదు. చలికోటు వాడిపట్ల కొండంత కోరికలా మిగిలిపోయింది. అయితే ఇన్నాళ్లకు అనుకోకుండానే అదృష్టం కలిసివచ్చింది ఆదంకు.

తల్లిచేత గోరు ముద్దలు తినే వయసులోనే ఓ కామందు ఇంటి పాలేరయినాడు. పెళ్లయి ఓ ఇంటి వాడయినాక పాలేరుగా మానేసి స్వతంత్రుడయ్యాడే కాని పని మాత్రం మారలేదు. ఇద్దరు బిడ్డల తండ్రయ్యాడు. ఏ రోజు కూలి ఆ రోజు కూటికే! కూలి లేని రోజు పొయ్యి మీద కుండ ఎక్కటం కష్టమయ్యేది. రోగాలు రొష్టులతో ఆదాయంలో తలకు మించిన తీసివేతలేగాని కూడికలు లేవు.

కూతుర్ని రెక్కల సత్తువున్న ఓ అయ్య చేతిలో పెట్టాడు. కాయ కష్టం చేయగల ఒక కూలిపిల్లని కొడుక్కి జతచేసి వేరు కాపురం పెట్టించాడు. ఆ తర్వాత కొద్ది కాలానికే డబ్బుకు తప్పలొంగని జబ్బుతో ముసల్ది తీసుకు తీసుకుని గుటుక్కుమన్నది.వండిపెట్టే ఆదదిక్కులేక కొడుకు పంచనే చేరాడు

అరవయ్యేళ్లు వచ్చేసరికి వంట్లో సత్తువ ఇంకిపోయింది. అలాగని ఆకలి మాత్రం ఇగిరిపోలేదు.కొడుకు కష్టంతో బ్రతకడం ఇష్టం లేకపోయింది. తన వయసుకు తగ్గ పనికోసం యోచన తప్పలేదు.

కాపలా ముత్తడు చనిపోవటంతో మరో కాపలావాడు వూరి కామందులకు అవసరమైనాడు. తన మీద రైతులకున్న నమ్మకంతో ఆ స్థానం ఆక్రమించుకోగలిగాడు ఆదం. పంట పొలాల కాపలాకు కాయకష్టంతో అంత పనిలేదు. కంటిమీద కునుకు లేకుండా రాత్రిళ్లు గస్తీ తిరిగితే చాలు. సంవత్సరానికి ఒకసారి సంక్రాంతికి రైతులు తలా కాస్త ధాన్యం కొలుస్తారు. ఆ విధంగా తిండి గింజలకు లోటు రాదనుకున్నాడు. తన బ్రతుకుబరువు కొడుకు మోయనక్కరలేదని సంతోషించాడు.

ఆదం కాపుచేలకు వెళ్లేసరికి చీకటి పడింది. ఎత్తుగావున్న మట్టిదిబ్బ మీద వేసున్న చుట్టు గుడిసె ముందు ఆగాడు. రాత్రిళ్లు అదే ఆదం స్థావరం.

లాంతరు నేలమీద వుంచి కనుచూపు మేర కలయజూశాడు.

మిణుగురులు నిప్పురవ్వల్లా ఎగురుతున్నాయి. వరికుప్పలు చీకటి ముద్దల్లా చుట్టూ పరచుకుని కనిపిస్తున్నాయి. కీచురాళ్ల రొద చెవుల్ని చిల్లులు పొడుస్తున్నట్లుంది. దిబ్బ మీదున్న రావి చెట్టు ఆకులు అంచెలంచెలుగా వీస్తున్న గాలికి రెపరెప లాడుతూ నిశ్శబ్దాన్ని తట్టి లేపుతున్నాయి. తాటిచెట్ల వరుసలు బారులు తీరిన గస్తీ సిపాయిల్లా వున్నాయి.

ఆదం దిబ్బమీద చతికిలబడ్డాడు. రోజూటిలా చలిగాలి విసురుకు వణికిపోతూ గాజు పురుగులా ముడుచుకు పోలేదు. కుంపట్లో కూర్చున్నట్లుగా కోటు వెచ్చదనాన్నిస్తున్నది. కోటు జేబులో నుండి పొగాకు కాడతీసి నోటితో ఆవిరిపట్టాడు. ఒక పాయలాగి చుట్టచుట్టుకున్నాడు. వెలిగించి గుప్పుగుప్పున పొగవదులుతుంటే ఎన్నడూ లేనంత కమ్మగా వున్నది.

ఆ ఏసుప్రభువు తన మొర ఆలకించి దొరకోటు ఇచ్చి పంపాడన్న భక్తి భావంతో ఆదం మనసు నిండిపోయింది.

"ప్రభువా, నీ బిడ్డల్ని సల్లంగచూడు" అనుకున్నాడు పదేపదే.

ఆ సమయంలోనే ఆదం మనసులో కొడుకు ఏసుపాదం మెదిలాడు.

"పిచ్చిసన్నాసి! ఎట్టాగున్నాడో!" అనుకున్నాడు ప్రేమగా.

అంతలోనే, "ఎగ్రైదవ, ఎగ్రైదవ" అంటూ కళ్లొత్తుకున్నాడు.

ఆ ప్రభువుకు కొడుకుమీద ఇంకా దయరాలేదు కాబోలని జైల్లోవున్న కొడుకును గురించి అనుకున్నాడు.

వాడేవుంటే ఇవ్వాళ దొరకోటు తెచ్చుకున్నందుకు ఎంతో గొడవ అయ్యుండేదనుకున్నాడు. మతంవాళ్లు ఇచ్చేవి పుచ్చుకోవటం కొడుక్కి గిట్టేదికాదు. ఇస్రాయిల్ శాస్త్రరంటేనే మండిపడేవాడు.

పల్లెలోకి కార్లలో దొరలు వస్తుండేవాళ్లు. ఏసుప్రభువు గురించి గంటల తరబడి చెప్పేవాళ్లు. ఆ భాష ఆదంకు అర్థం అయ్యేదికాదు. ఇస్రాయిల్ అర్థమయ్యేలా చెపుతుంటే చెవిగోసుకు వినేవాడు. పేదలంటే ఏసుప్రభువుకు ఎంతప్రేమో తెలుసుకుంటుంటే ఆదం వళ్లు పులకరించేది.

"ఇలాంటి ఏసయ్యనా సిలువేసింది" అంటూ ఏడ్చేసేవాడు.

దేవుడి పేరుమీద గోధుమలిచ్చేవాళ్లు. బట్టలిచ్చేవాళ్లు. ఒకసారి గోధుమలు తీసికెళ్తే నానామాటలన్నాడు ఏసుపాదం.

"ఏందయ్యా! ముస్టెత్తుకున్నావా?" అన్నాడు కోపంగా.

"ముస్టేందిరా! ప్రభువుదయ!" అన్నాడు ఆదం.

"ఈ రోజుతోనే బతుకులు ఎల్ల మారతాయనుకున్నావా?"

"రోజూ ఆల్లుమాత్తరం యాడ్నించి తెచ్చిత్తార్రా!"

"రోజు బాగ్గేనికి కక్కుర్తి ఎందుకు? మన రెక్కల కట్టం మనకు తప్పుద్దా!"

"దయగల మారాజులు పేదోల్లని దయతో ఇచ్చారు. ఇందులో తప్పేముంది?" అన్నాడు బాధగా.

"అవునయ్యా! పేదోల్లంటే ఆల్లదయ ఇంత గొప్పగా వుండబట్టే నేనూ, నువ్వూ, నీ అయ్యా, వాడయ్యా, వాడ్ని కన్నయ్యా అంతా కూలోల్లుగానే బతుకుతున్నాం. కూటికి మొగంవాసి పోతున్నాం. ఆల్లంతా మన మంచికోసమే దేవుడి పేరు, దేశంపేరూ, చెప్పుకుంటూ వుండారు. ఎర్రోల్లం గనుక దన్నాలెడుతున్నాం" అన్నాడు ఏసుపాదం ఆవేశంగా.

"ఏందిరా ఎనకాముందు సూడకుండా పేలిపోతున్నావ్?" అన్నాడు ఉక్రోషంగా ఆదం.

"నిజం మాటాడినోడికి పిచ్చెక్కిందనో, తలపొగరనో పెద్దోల్లంటారు. నీ బోటోల్లందరూ ఆల్లకు వంతపాడతారు. నా రెక్కల కట్టంతోనే నా వోల్లని బతికించుకోగల్ను. ఆ ముస్టేదో నువ్వే తిను" అంటూ ఛీత్కరించాడు.

ఏసుపాదం మాటలు ఆదం మనసును శూలాల్లాగుచ్చాయి. పుట్టి ఎరిగినాక రెక్కల కష్టంతోనే తను బ్రతికాడు. తన బిడ్డల్ని బ్రతికించుకున్నాడు. మాటలు పడ్డందుకు అభిమానంతో కృంగిపోయాడు. తెచ్చిన గోధుమలు తెచ్చినట్లే తీసుకెళ్లి ఎవరికో ఇచ్చేశాడు. అవమానంతో ముద్ద నోట్లోకి వెళ్లింది కాదు.

"అయ్యా! పేదోల్లంతా ఇట్టా మాయలు మోసాల్లో పడిపోబట్టే మన బతుకులు గొంగళ్లలాగున్నాయి. ఇస్రాయిల్ లాటోల్లు దేవుడి పేరు చెప్పుకుని మనల్ని దోసు కుంటున్నారు" అంటూ బాధపడ్తున్న తండ్రిని అనునయించాడు ఏసుపాదం.

కొడుకు చీటికి మాటికి ఇస్రాయిల్‌ని ఆడిపోసుకోవటం ఆదంను భయ పెడ్తున్నది. ఒకప్పుడు పల్లె పల్లెంతా ఒక్క తాటి మీదుండే వాళ్లు. ఇప్పుడు రెండు వర్గాలయ్యారు.

మిషనరీ వాళ్ళు పల్లెలో పెద్ద చర్చి కట్టించారు. బడిపంతులు ఉద్యోగం చేస్తున్న ఇస్రాయిల్ మతం పుచ్చుకుని పాస్టరయ్యాడు. పల్లెంతా మతంలో చేరింది. పేర్లు మారాయి. ఇస్రాయిల్ పేద వాళ్ల కోసం బడి పెట్టించాడు. తిండి, బట్టా సమకూర్చి చదువులు చెప్పిస్తున్నాడు. నాలుగు అక్షరం ముక్కలు పిల్లలకు అబ్బుతున్నా యంటే అది ఇస్రాయిల్ చలవేనని చాల మందిలానే ఆదం నమ్మాడు. అలాంటి ఇస్రాయిల్‌ని డేవిడ్ వర్గంవాళ్లు అన్యాయంగా దుమ్మెత్తి పోస్తున్నారని ఆదంలా చాలమంది అనుకుంటున్నారు.

ఒకప్పుడు ఇస్రాయిల్, డేవిడ్ మంచి స్నేహితులు. ఉన్నట్లుండి ఇద్దరికి మధ్య పగ రగిలింది. ఇస్రాయిల్ అవినీతికి పాల్పడుతున్నాడని డేవిడ్ ప్రచారం మొదలెట్టాడు. తన పేరు ప్రతిష్టలకు ఓర్వలేక డేవిడ్ తప్పుడు మాటలాడుతున్నాడని ఇస్రాయిల్ అంటున్నాడు. వాళ్లిద్దరి మాటలపై వున్న విశ్వాసాన్నిబట్టి పల్లె రెండుగా చీలింది.

ఒకరోజు ఆదంకు ఇస్రాయిల్ కబురెట్టాడు. "పెద్దయ్యా! నీ కొడుకును అదుపులో పెట్టు. లేకుంటె తర్వాత విచారిస్తావు" అంటూ గట్టిగా హెచ్చరించాడు.

ఆదం కొడుకును మందలించబోయాడు.

"అయ్యా! ఇస్రాయిల్ బడిపంతులుగా వున్నప్పుడు పూరి గుడిసెలో వుండేవోడు. ఇయ్యాల పెంకుటిల్లు కట్టాడు. మోటర్ సైకిల్ కొన్నాడు. ఆడిపిల్లల్ని పట్నంలో సదివిత్తన్నాడు. ఈ దబ్బంతా ఒక్కసారి యాడ్నుంచి వచ్చింది?" ప్రశ్నించాడు.

"ఆడ్ని దేవుడు కనికరించాడు. పైకొచ్చాడు."

"దేవుడు కనికరించకపోవటానికి మనం ఏం పాపం చేశామయ్యా?" నిగ్గదీశాడు ఏసుపాదం.

"ఆడి దురదుట్టం ఆడిది. మన దురదుట్టం మనది."

"అలాగని అందర్నీ నమ్మించబట్టే వాడి ఆటలు సాగుతున్నాయి. మిసనోల్లు బీదా బిక్కికి ఇమ్మన్నదాంట్లో సగం మింగేస్తన్నాడు. బడిపిల్లల నోటికాడు కొట్టి సొమ్ము ఎనకేస్తన్నాడు. మన బతుకుల మీద ఆడు నిచ్చెనేస్తన్నాడు." ఆవేశంగా పిడికిళ్లు బిగించాడు ఏసుపాదం.

"ఒరేయ్! ఇస్రాయిల్ దేవుడి మనిషి. అడ్నంటే గుడ్లు పోతయి" అన్నాడు ఆదం భక్తిగా.

"ఆరుగాలం కట్టపడే మనకు దేవుడ్ని చేరుకునే మార్గంకాదు తెలవాల్సింది, ఈ దరిద్రాన్ని గట్టెక్కించేదారి. మన బతుకులు ఇంత అద్దాన్నంగా ఎందుకున్నాయో తెలియాలి. మన బతుకుల్ని కమ్మిన చీకటిని తరిమే ఎలుగు ఎలావత్తదో సెప్పే దేవుడు కావాలి. పొద్దొడిసిన కాడ్నుంచి పొట్టకూటి కోసం ఆరాటపడే మనకు ఈ బోధలు ఏ పాటి కడుపునింపుతయి?" అన్న కొడుకు మాటలకు ఆదం నోరు పెగల్లేదు.

కూలి వున్ననాడు కష్టపడటం, కడుపునిండా తినటం, కూలి లేనినాడు కాళ్లు ముడుచుకుని పడుకుని పస్తులుండటం తప్ప ఏ విధమైన ఆలోచనలు లేకుండా బ్రతకటానికి అలవాటుపడ్డ ఆదం, వెలుగుబాట వెతుక్కుంటున్న కొడుకు ఆలోచనా ధోరణుల్ని తన బుర్రలో ఇముడ్చుకోలేక పోయాడు.

పేదపిల్లల బడిలో అవకతవకలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వెళ్లటంతో మిషనరీ వాళ్లు హఠాత్తుగా తనిఖీకి వచ్చారు. ముందే ఈ విషయం పసిగట్టిన ఇస్రాయిల్ నష్టపోయిందేమీ లేదు. గిట్టని వాళ్లు చేసిన ఫిర్యాదులుగా వాళ్లని చక్కగా నమ్మించగలిగాడు.

ఆ తర్వాతే అసలు రగడ మొదలైంది. కత్తులు, కటార్లతో ఇరువర్గాల వాళ్లూ తలపడ్డారు. తలలు పగిలాయి. కాళ్లూ, చేతులూ విరిగాయి. ఒక ప్రాణం పోనే పోయింది. పోలీసు వ్యాన్లు వచ్చాయి. పల్లెలో కనపడ్డ మగాడ్నల్లా చితకబాదారు. జైల్లో తోసి కేసులు బనాయించారు. కోర్టులకు ఈడ్చారు.

కొందరికి యావజ్జీవ ఖైదు శిక్షపడింది. ఏసుపాదానికి ఐదేళ్ల జైలు శిక్ష పడింది.

ఆదం దుఃఖానికి అంతులేదు. ఇస్రాయిల్ కాళ్లు పట్టుకున్నాడు.

"పెద్దయ్యా! ప్రభువు నిర్ణయం అలా వున్నది. మనమేం చేయగలం" అంటూ చేతులు దులుపుకున్నాడు.

ఏదో శబ్దం చెవుల్ని తాకేసరికి ఉలిక్కి పడ్డాడు ఆదం.

ఆరిన చుట్టను చెవిలో పెట్టుకొని, పోటుకర్ర చేతిలోకి తీసుకుని లేచి నిలబడ్డాడు.

పరకాయించి చూసేడు. దొంగ గొడ్డొకటి మినపమొక్కలు మేస్తూ కనిపించింది. కేకలేస్తూ అటుకేసి పరిగెత్తాడు. దాన్ని తరిమి తరిమికొట్టి తిరిగొచ్చాడు. చుట్టను తిరిగి వెలిగించుకుని నింపాదిగా కాలుస్తూ కూర్చున్నాడు.

* * *

మిట్టమధ్యాహ్నం. ఎండ చిటపట లాడిస్తున్నది. ఏదో పోగొట్టుకున్నట్లు పల్లెంతా తిరుగుతున్నాడు ఆదం. వాడి మనసు మనసులో లేదు. మనవడికి జ్వరం. ఉదయం నుండి మూసిన కన్ను తెరవనేలేదు.

ఉదయం ఆ వూరి డాక్టరుకు చూపెట్టారు తను, కోడలూ వెళ్లి. పరీక్ష చేశాడు.

"ఎప్పట్నుంచి జ్వరం?"

"మూఁడ్రోజుల్నుండయ్యా."

"ఇప్పటిదాకా మరి ఏం చేస్తున్నట్లు?"

"ఏదో చిటకా వొయిద్యం చేశానండి. తగ్గలా." కోడలు చెప్పింది.

డాక్టరు కస్సున లేచాడు. ప్రిస్కిప్షన్ చేతిలో పెట్టాడు మందులు కొనుక్కురమ్మని.

"అయ్యా! కనికరించాలి. చేతిలో చిల్లిగవ్వలేదు. బిడ్డ అన్నేయమై పోతాడు." గొల్లుమంది కోడలు.

డాక్టర్ చిరాకు పడ్డాడు. "ఏదో పేదవాళ్లులెమ్మని వైద్యం ఉచితంగా చేయగలనుగాని మీలాంటి వాళ్లందరికి మందులు నేనేడతేను. వెళ్లి మందులు తెచ్చుకోండి" నిష్కర్షగా చెప్పాడు.

కోడల్ని, మనవడ్ని హాస్పిటల్లోనే వుంచి చీటీ తీసుకుని మందుల షాపుకి పరిగెత్తాడు ఆదం. మొత్తం యాభై రూపాయలిమ్మన్నాడు షాపువాడు. డబ్బులేదన్నాడు ఆదం. అయితే మందులూ లేవన్నాడు షాపువాడు. రైతులు ధాన్యం కొలవగానే అమ్మి డబ్బు తెచ్చిస్తానన్నాడు ఆదం. అప్పుడే మందులూ ఇస్తాం లెమ్మని కసిరి కొట్టారు.

అప్పట్నుండి యాభై రూపాయలకోసం తిరుగుతూనే వున్నాడు. డబ్బులు పుట్టలేదు. అందుకని మందులు కొన్లేదు. మందులు దొరకలేదు గనుక హాస్పిటల్కేసి వెళ్లలేదు. మగతగా పడున్న మనవడ్ని తలుచుకుంటూ కుమిలిపోతున్నాడు ఆదం.

తిరుగుతూ తిరుగుతూ చర్చి దగ్గరకెళ్లాడు.

"ఏసుప్రభువా! మనవడికేదన్నా అయితే కొడుక్కి ఏంసెప్పుకోను? కరుణించుప్రభూ!" అంటూ చేతులు జోడించి వేడుకున్నాడు.

నాలుగడుగులు వేసేసరికి ఒక గుంపు కనిపించింది. ఆ గుంపు మధ్యలో మిషనరీ వాళ్లు పంచిన బట్టలు కొంటున్న పట్నం వాళ్లు కనిపించారు. వాళ్లకేసి వెర్రిగా చూసేడు.

"ఏరా అమ్ముకొంటున్నారా?" అన్నాడు దీనంగా.

"అమ్ముకోక ఏంచేత్తాం" అన్నారంతా.

గుంపు మధ్యలో గుట్టగాపడుతున్న బట్టలు చూసేడు.పల్లెవాళ్లచేతుల్లో రెపరెప లాడుతున్న పచ్చనోట్లు కనిపించాయి.వాళ్ల ముఖాలు ఆనందంతో వెలిగిపోతున్నాయి.

"అవునొరే! మనం మనకోసరం ఏం మిగుల్చుకోగలంరా!" అంటూ ఓ ఊళ్లి కేకేసి గుడిసెకేసి పరిగెత్తాడు ఆదం.

* * *

ఆదం రోజులానే సాయంత్రం కాపలాకు బయల్దేరాడు. వాడి ముఖం వడలిన ఆకులా వున్నది.

"మామా! దొరకోటు ఏసికెల్లవేం?" అంటూ కేకేసి గుర్తు చేసింది ఆదం కోడలు.

ఆదం మాట్లాడలేదు. నీరసంగా వెనుదిరిగాడు. కోడలి వడిలోవున్న మనవడికేసి సంతృప్తిగా చూశాడు. జ్వరం తగ్గ ముఖం పట్టి తేట పడ్తున్నాడు

వాడి భుజాన పాతకంబళి వేలాడుతున్నది. పోటుకర్ర, డొక్కులాంతరు చేతబట్టుకున్నాడు. ఉసూరుమంటూ అడుగులో అడుగేసుకుంటూ ఊళ్లోకి సాగాడు. ఈ పది రోజులుగా వాడిలో ఉన్న ఉత్సాహం ఈ రోజు లేదు.

ఆదం పాతరూపాన్ని ఊరి జనం చిత్రంగా చూశారు.

"ఏరా! వేషం మళ్లీ మారిందేవిటి! నీ దొరకోటు ఏమైంది? ఎంత గిట్టుబాటు అయింది?". కోటు ఒకటి తెచ్చిపెట్టమని లోగడ అడిగిన ఆసామి హాస్యం చేశాడు.

ఆ మాటలకు ఆదం మనసు విలవిలలాడింది. కళ్లలో నీరు గిర్రున తిరిగింది.

"పేదోణ్ణి... ఏం చేత్తానయ్యా... పిల్లగాడికి జొరం. దబ్బుల్లేక..." అక్కడ నిలబడలేక ముందుకుసాగాడు ఆదం.

అక్కడున్న నలుగురూ ఫకాల్న నవ్వేరు.

కన్నీటి తడికి మసకబారిన ఆదం కళ్లల్లో దొరకోటు లీలగా అలలు అలలుగా కదులాడింది. కొడుకన్న మాటలు వాడి గుండెలో సెగలు పుట్టిస్తున్నాయి.

*(స్వాతి, నవంబరు 1985)*